


అప్పన్న చెంతా.. పేదల పెళ్లి చింత!

- సింహాచలంలో పెళ్లిళ్లకు దేవస్థానం సత్రాలు కరవు
- పుష్కరిణి సత్రం తొలగింపు.. సేవలు నిలిపేసిన టీటీడీ సత్రం
- శ్రీదేవి కాంప్లెక్స్ కల్యాణ మండపాలు వేరే వాటికి కేటాయింపు
- దేవస్థానం కార్యాలయంగా విజయరామరాజు కల్యాణమండపం
- ప్రైవేట్ మండపాలను ఆశ్రయించి చేతి చమురు వదిలించుకుంటున్న పేదలు

పేద, మధ్యతరగతి వాళ్లు పెళ్లి చేసుకునేందుకు సింహాచలం కొండ దిగువ దేవస్థానం కల్యాణమండపాలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు కల్యాణమండపాలకు అధిక ధరలు చెల్లించలేక సతమతమవుతున్నారు. పదేళ్ల కిందటి వరకు కొండదిగువ పేద, మధ్యతరగతి వాళ్లకు అనుకూలంగా ఉన్న దేవస్థానం కల్యాణ మండపాలు కనుమరుగవడమే ఇందుకు కారణం.

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వెలసిన సింహాచలంలో తమ పిల్లలకు పెళ్లిళ్లు చేయాలని పలువురు మొక్కుకుంటుంటారు. స్వామిని తమ ఇలవేల్పుగా కొలిచే ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వారు తమ పిల్లలకు ఎక్కువగా సింహాచలంలో పెళ్లి జరిపిస్తుంటారు. వీరిలో చాలామంది పేదలు, మధ్యతరగతివారే. వీరి కోసం కొండ దిగువ పుష్కరిణి సత్రం, టీటీడీ సత్రం, గోదా కల్యాణమండపం, విజయరామరాజు కల్యాణమండపం అందుబాటులో ఉండేవి. అవన్నీ ఇప్పుడు గత చరిత్రగా మారాయి.

అందుబాటులో లేని శ్రీదేవి కాంప్లెక్స్


విద్యార్థుల బసగా మారిన శ్రీదేవి కాంప్లెక్స్

పేదలకు ఉచితంగా కల్యాణమండపాలు అందుబాటులో ఉంచాలన్న దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు సంకల్పం మేరకు కొండదిగువ ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఏడేళ్ల క్రితం దేవస్థానం శ్రీదేవి కాంప్లెక్స్ నిర్మించింది. దిగువ భాగంలో షాపులు, పైభాగంలో నాలుగు కల్యాణమండపాలు ఏర్పాటు చేశారు. మండపాలను వివాహాలకు ఉచితంగానే ఇచ్చేందుకు నిర్ణయించారు. రెండేళ్ల పాటు బాగానే నడిచింది. ఆ తర్వాత దేవస్థానం నాద పాఠశాల హాస్టల్ విద్యార్థుల బసకు ఒక మండపం, సంస్కృతోన్నత పాఠశాల హాస్టల్‌గా ఇంకో మండపాన్ని కేటాయించారు. మిగిలిన రెండింటిని యాత్రికుల ఉచిత బసగా మార్చేశారు.

టీటీడీ సత్రాన్ని చూస్తే బాధేస్తుంది



పేద, మధ్య తరగతి ప్రజల వివాహాలకు టీటీడీ సత్రం ఎంతో అనువుగా ఉండేది. ఈ సత్రంలో ఎన్నో పెళ్లిళ్లు జరగడం నేను చూశా. పెళ్లి బృందానికి సరిపడా గదులు, విశాల ప్రాంగణం అతి తక్కువ ధరకే లభించేవి. ఇక్కడి మండపాల్లో ఇదే అతి పెద్దది. ప్రస్తుతం టీటీడీ సత్రం సేవలు నిలిచిపోవడం చాలా బాధగా ఉంది.

– మూర్తి, సింహాచలం

పేదల గురించి ఆలోచించాలి



అప్పన్న సన్నిధిలో తమ పిల్లల పెళ్లి చేయాలని మా జిల్లాలో చాలా మంది మొక్కుకుంటారు. అందరూ పెద్ద మొత్తంలో అద్దె చెల్లించి ప్రైవేట్ కల్యాణ మండపాలు తీసుకోలేని పరిస్థితి. అలాంటి వారి కోసం దేవస్థానం తక్కువ ధరలకే మండపాలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–మల్లేశ్వరరావు, శ్రీకాకుళం

నిలిచిన పుష్కరిణి సత్రం పనులు


పుష్కరిణి సత్రం స్థానంలో ప్రసాద్ స్కీమ్‌లో చేపట్టిన కల్యాణమండపం (ప్రస్తుతం నిలిచిన పనులు)

పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే పుష్కరిణి సత్రం కళకళలాడేది. రెండు అంతస్తుల్లో 40 గదులు ఉండేవి. మండపం ప్రాంగణంలో ఒకేసారి ఇరవై పెళ్లిళ్ల వరకు జరిగేవి. ఒక వివాహ బృందం ఒక మండపం వేసుకుంటే రెండు గదులు వారికి ఇచ్చేవారు. గది అద్దె రూ.100 మాత్రమే ఉండేది. సింహగిరి దివ్యక్షేత్రం పనుల్లో భాగంగా పదేళ్ల క్రిందట సింహగిరిపై ఉన్న గిరిజనులను, నిర్వాసితులకు పుష్కరిణి సత్రంలో తాత్కాలిక వసతి కల్పించారు. కొన్ని గదుల్లో దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థుల హాస్టల్ కిచెన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పుష్కరిణి సత్రం పెళ్లి వేడుకలకు దూరమైంది. రెండేళ్ల క్రితం ప్రసాద్ స్కీమ్ పనుల్లో భాగంగా దీన్ని పూర్తిగా తొలగించారు. దాని స్థానంలో చేపడుతున్న ఆధునిక సత్రం పనులు కూడా అర్ధంతరంగా నిలిచిపోయాయి.

టీటీడీ సత్రం సేవలకు సెలవు


నిరుపయోగంగా ఉన్న టీటీడీ సత్రం

కొండ దిగువన 1978లో టీటీడీపీ రెండు అంతస్తుల్లో(ఒక్కో దాంట్లో ఆరేసి గదులు) సత్రాన్ని నిర్మించి, దేవస్థానానికి అప్పగించింది. వివాహాలకు రెండు పెద్ద డయాస్‌లతో కూడిన విశాల ప్రాంగణం ఉంది. ఒక వేదిక, ఆరు గదులు బుక్ చేసుకుంటే సుమారు రూ.5 వేలతో అయిపోయేది. సింహాచలంలో పెళ్లి చేసుకోవాలంటే అది టీటీడీ సత్రంలోనే అన్నంత గొప్పగా ఉండేది. నిర్వహణ లోపంతో నాలుగేళ్ల నుంచి టీటీడీ సత్రం సేవలు నిలిచిపోయాయి. భవనం రంగులు వెలిసిపోయి, కొన్నిచోట్ల పెచ్చులూడుతూ మరమ్మతులకు గురైంది. ఇటీవల ఓ గదిని ఆధునీకరించి రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌కు కేటాయించారు. మిగిలిన వాటి మరమ్మతులపై దృష్టి సారించట్లేదు. విజయరామరాజు కల్యాణ మండపాన్ని దేవస్థానం కార్యాలయంగా మార్చేయడంతో అది కూడా పేదల పెళ్లిళ్లకు అందుబాటులో లేకుండా పోయింది.

క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


శ్రీనివాస హరిగోపాల్‌కు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సిరిపురానికి చెందిన శ్రీనివాస హరిగోపాల్ అనే దాత రూ.లక్ష విరాళమిచ్చారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో అందించారు. దేవస్థానం తరఫున దాతకు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు బాండ్ ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు. పీఆర్వో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వరాహనరసింహం, పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఆనంద గజపతిరాజు జయంతి


ఆనంద గజపతిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త దివంగత పూసపాటి ఆనంద గజపతిరాజు జయంతిని గురువారం దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు పూలమాలవేసి నివాళులర్పించారు. దేవస్థానం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో సాగాలి


మాట్లాడుతున్న జగదీష్‌కుమార్

పెందుర్తి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, దాన్ని చేరుకునేందుకు నిరంతరం కృషి చేయాలని ఐసీఎఫ్ఏఐ బిజినెస్ స్కూల్ రీజనల్ మేనేజర్ ఎం.జగదీష్‌కుమార్ సూచించారు. స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ టు కార్పొరేట్ అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ కోసం వేసుకోవాల్సిన ప్రణాళిక, సమస్యల పరిష్కారం, తదితర అంశాల గురించి అవగాహన కలిగించారు. కరస్పాండెంట్ టి.థియోఫిలస్, ప్రిన్సిపాల్ ఎస్ఈ ఫ్లోరా, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ టిడ్కో ఇళ్లు


సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: నియోజకవర్గ పరిధిలోని చీమలాపల్లి, నడుపూరు, పెదగంట్యాడ, అప్పికొండ ప్రాంతాల్లో ఉన్న టిడ్కో ఇళ్లు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. సుజాతనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ జోన్-6, 8 అధికారులతో టిడ్కో ఇళ్ల పురోగతి, ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లోని టిడ్కో గృహాలను రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ శుక్రవారం సందర్శిస్తారని వెల్లడించారు. సమీక్షలో జోన్-6, 8 జోనల్ కమిషనర్లు హేమావతి, శేషాద్రి, ఈఈ అప్పారావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐగా నియమితులైన కోట సురేష్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన చేశారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి


ఆరిపాక జెడ్పీ హైస్కూల్ ఎన్‌రోల్‌మెంట్‌ను పరిశీలిస్తున్న అనకాపల్లి డీఈవో అప్పారావు


సబ్బవరం: మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి, విద్యార్థుల నమోదును పరిశీలించారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరచాలని ఉపాధ్యాయులను కోరారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామలక్ష్మి, సంగీత, కామేశ్వరి, రమణమ్మ, సూర్యకుమారి, కమల మనోహర్, శారదాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు


బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, తదితరులు


సబ్బవరం: మండలంలోని ఆరిపాక గ్రామ సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న సిబ్బందిని గ్రామ సర్పంచ్ పాలిశెట్టి పార్వతి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందించి ఆత్మీయ సత్కారం చేశారు. ఇన్నాళ్లూ వారందించిన సేవల్ని కొనియాడారు. సర్పంచ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్, పంచాయతీ పెద్దలు, పార్టీ నాయకులు ఎస్‌పీ రాజు, బండారు రమణ, శరగడం శ్రీనివాస్, బొడ్డేటి మహలక్ష్మినాయుడు, మళ్ల కోటేశ్వరరావు, మళ్ల బాలాజీ, అండిబోయిన కోటిరాజు, కూటమి నాయకులు ఆడారి నాగరాజు, యడ్ల హరి, ఆడారి వెంకీ, కాళ్ల శ్రీను, బొడ్డేటి కాశీ, బత్తిన శివ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తుప్పలు, డొంకల మధ్య పశువుల ఆస్పత్రి


తుప్పల మాటున పరవాడ పశువుల ఆస్పత్రి

పరవాడ: అనారోగ్యం పాలైన పశువులను వైద్యం కోసం తీసుకొచ్చే పరవాడ ప్రాంత ప్రజలు పశువుల ఆస్పత్రి ఆచూకీ తెలియక అవస్థలు పడుతున్నారు. ఎలాగోలా ఆస్పత్రి ఆచూకీ తెలుసుకుని తుప్పలు, డొంకలు దాటుకుని వెళ్లి పశువులకు వైద్యం చేయించాల్సిన దుస్థితి ఈ ప్రాంత ప్రజలకు ఏర్పడింది. మండల కాంప్లెక్స్ కూడలిలో ఏర్పాటుచేసిన పశువుల ఆస్పత్రి భవనం చాలా కాలంగా మరమ్మతులకు గురైంది. దీంతోపాటు ఆస్పత్రి చుట్టూ దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలతో బయట ప్రపంచానికి కనిపించని పరిస్థితి. పశువులకు అత్యవసర చికిత్స చేయించాల్సిన వారు తుప్పల్ని దాటుకుని, ఆస్పత్రికి వెళ్లేందుకు చాలా సమయం పడుతోంది. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న పశువుల ప్రాణాల మీదకు వస్తోందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఆస్పత్రి భవనం చుట్టూ దట్టంగా పెరిగిన తుప్పలను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోలేదు. పెరిగిన తుప్పలు, డొంకలతో విష జంతువులు, పురుగులు ఆస్పత్రిలోకి ప్రవేశించి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి, పశువుల ఆస్పత్రి చుట్టూ పెరిగిన తుప్పలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'ఉపాధి' పథకంపై అవగాహన


గ్రామీణ భాగస్వామ్య పటం ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధి పథకం సిబ్బంది

సబ్బవరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడంతో పాటు, పనికి తగ్గ వేతనం అందిస్తున్నట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు. మండలంలోని అసకపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా సోషల్ ఆడిట్ ఐసీఈ టీమ్ ద్వారా గ్రామస్తులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు రూ.307 రోజువారీ వేతనం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పలు ఉపాధి హామీ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ భాగస్వామ్య అంచనా పటం ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి నరసింగరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, ఉప సర్పంచ్ కరణం సురేష్, వీఆర్వో ఈశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వసంతకుమార్, ఈసీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాఫియా అక్రమాలను అడ్డుకోండి

రాయపురాజు చెరువు పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్


రాయపురాజు చెరువును పార్టీ నాయకులతో కలిసి పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి కక్ష సాధింపులు, అక్రమ కేసులతో పాటు దోచుకోవడం, దాచుకోవడం ప్రధాన ఎజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దుయ్యబట్టారు. మండలంలోని పెదగొల్లలపాలెం రాయపురాజు చెరువులో చేపడుతున్న మట్టి అక్రమ తవ్వకాలను పార్టీ నేతలతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల సంక్షేమం, అభివృద్ధిని ఏ రోజూ పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రజల్లో ఎండగట్టేలా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.

మండలంలోని పెదగొల్లలపాలెం రాయపురాజు చెరువు సుమారు 205 ఎకరాల్లో విస్తరించి ఉందని, ఇందులో మట్టిని అనుమతుల్లేకుండా తరలించుకుపోతున్నారని ఆక్షేపించారు. ఈ అక్రమ తవ్వకాలను అడ్డుకునే గ్రామస్తుల్ని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇరిగేషన్, మైనింగ్ అధికారులు ఇచ్చిన అనుమతులు ఆ రెవెన్యూ పరిధి రైతులు లో లెవల్‌లో ఉన్న తమ వ్యవసాయ భూములను 47 సెంట్లు వరకూ ఫిల్లింగ్‌కు వాడుకునేలా మాత్రమే ఉన్నాయన్నారు. ఇలాంటి పత్రాలతో ఇక్కడ భారీ ఎత్తున మట్టి తవ్వకాలు చేపట్టి గాజువాక, గోపాలపట్నం ప్రాంతాలతో పాటు, జీవీఎంసీ పరిధిలో ఫిల్లింగ్‌కు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. బుధవారం రాత్రి సైతం గ్రామస్తులు అక్రమ తవ్వకాలను అడ్డుకుని పోలీస్‌లకు అప్పగిస్తే, కొంత దూరం వెళ్లాక వాటిని విడిచిపెట్టారని వెల్లడించారు. ఇరిగేషన్, మైనింగ్, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారులను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, మండల కన్వీనర్ కర్రి బాబు, సర్పంచ్ మోపాడ అప్పారావు, మాజీ సర్పంచ్ కొమ్ము కనకరాజు, నాయకులు వడ్డాది అప్పలరాజు, యర్ర శ్రీనివాసరావు, మధు, గవర రాజు, దనిమిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

2,700 మంది విద్యార్థులకు 'స్టేషనరీ' పంపిణీ


స్టేషనరీ సామగ్రి అందిస్తున్న జేసీబీ ప్రసాద్

పెందుర్తి: స్థానిక అక్షర భారతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నెల్లూరు ప్రసాద్(జేసీబీ ప్రసాద్) తన సొంత నిధులతో మండలంలోని 30 ఎంపీపీ, ఎంపీయూపీ, జెడ్పీ హైస్కూళ్లతోపాటు, దేవరాపల్లిలోని 4 పాఠశాలల్లో చదువుతున్న 3,300 మంది విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి సమకూర్చారు. గురువారం పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా ఆయా సామగ్రి పంపిణీ ప్రారంభించారు. తొలిరోజు 19 పాఠశాలల్లోని 2,700 మంది విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు ప్రసాద్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు సేవలందించాలన్న సంకల్పంతోనే ట్రస్ట్‌ను ప్రారంభించామన్నారు. శుక్రవారం మిగిలిన విద్యార్థులకు సామగ్రి అందిస్తామన్నారు. పెందుర్తి మండలంలో టెన్త్‌లో మొదటి ఐదు ర్యాంక్‌లు సాధించిన, సరిపల్లి జెడ్పీ హైస్కూల్లో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, మురళి, ట్రస్ట్ ప్రతినిధులు సతీష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

మద్యం దుకాణ యజమానులకు డీఎస్పీ విష్ణుస్వరూప్ హెచ్చరిక


మద్యం దుకాణ యజమానులతో సమావేశమైన డీఎస్పీ విష్ణు స్వరూప్, సీఐ మల్లికార్జునరావు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో మద్యం బెల్ట్ షాపులను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలోని మద్యం దుకాణ యజమానులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్ట్ షాపులకు లైసెన్స్ మద్యం దుకాణాల నుంచి మద్యం సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం దుకాణాల వద్ద మందుబాబులు బహిరంగ మద్య సేవనం గుర్తించామన్నారు. ఇలాంటి ఏర్పాట్లు చేసిన వాళ్లు, వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. మద్యం దుకాణాల వద్ద కేవలం అమ్మకాలు మాత్రమే జరపాలని, తాగించడం చట్టవిరుద్ధమన్నారు. ఈ నిబంధనలను ప్రతి యజమాని విధిగా పాటించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలకు బాధ్యులు కాగలరని డీఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో పరవాడ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ సత్యనారాయణ, మద్యం దుకాణ యజమానులు పాల్గొన్నారు.

గోతులమయంగా ఫార్మాసిటీ రోడ్డు



పరవాడ: పరవాడ–లంకెలపాలెం దారిలో ఇండస్ట్రియల్ పార్క్ వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. ఫార్మా, ఎన్టీపీసీ ఉద్యోగులు, కార్మికులు, ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. కనీసం గోతులైనా పూడ్చాలని అధికారులను కోరుతున్నారు.